క్లుప్తంగా

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



పట్ట పగలే వెలుగుతున్న వీధి లైటు

బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని చిన్నయగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని జంబుగోళం గ్రామంలోని వీధి లైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. లైట్లు తొందరగా దెబ్బతింటున్నాయి. లైట్లను ఆర్పిటానికి స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఆపలేకపోతున్నారు. దీంతో పట్టపగలే లైట్లు వెలుగుతున్నాయి. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పగలు లైట్లు వెలగకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో సోమవారం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించారు. గ్రామంలోని యువకులు, మహిళలు ఒకరినొకరు వసంతాల నీటిని పోసుకున్నారు. పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పండరి భజన



భజన చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని మైక్రోవేవ్ స్టేషన్ కాలనీలోని గ్రామదేవత గంగమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం భక్తులు చేసిన పండరి భజన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కాలనీవాసులు పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ పంచాయతీ లక్ష్మీపురం గిరిజన కాలనీలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో 32 మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలు పిల్లలున్నారు. ఈ భవన నిర్మాణ పనులు ఆరేళ్లుగా జరుగుతున్నాయి. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణోత్సవం

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజిమ్మాపురం గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు సోమవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణోత్సవానికి కుమార్‌రెడ్డి, ప్రమీల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. భక్తులు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ విద్యుత్ దీపాలంకరణలో నీర్పాకోటలోని మసీదు, ప్రత్యేక బోధనలు చేస్తున్న మతగురువు, సత్యవేడు మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు, ప్రార్థనలకు హాజరైన చిన్నారులు









భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

రేణిగుంట: మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా ఈద్–ఉల్–జుహా(బక్రీద్)ను పురస్కరించుకుని బాలికోన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఈద్గా వద్దకు తరలివచ్చిన ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ముస్లింలకు బక్రీద్ విశిష్టత, సందేశాన్ని ఇచ్చారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొందరు మజ్జిగ, శీతల పానీయాలను పంపిణీ చేశారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలో ముస్లింలు ఘనంగా బక్రీద్ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద, ఈదులగుంట వద్ద ఉన్న ఈద్గాల వద్దకు చేరుకున్నారు. ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేశారు. దీనికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై ప్రార్థనలు చేశారు. ఆయనకు ముస్లింలు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, ముతవల్లీ పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రార్థనలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో కాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, వెస్టువరత్తూరు, గాజులపెళ్లూరు గ్రామాల్లోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నీర్పాకోట, కాటూరు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



వరదయ్యపాళెంలోని ఈద్గా మైదానంలో ప్రసంగిస్తున్న మతగురువు

ఘనంగా బక్రీద్

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాపానాయుడుపేట, ఏర్పేడు, మాధవమాల, మఠంపల్లె తదితర గ్రామాల్లో ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు.

త్యాగానికి ప్రతీక

సత్యవేడు: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మసీదు హిమామ్(గురువు) మహ్మద్ షబీల్ తెలిపారు. మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సత్తారియా అహలే సున్నత్‌వల్ జమాత్ మసీదులో ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం మిత్రులకు ఖీర్‌ను పంచిపెట్టారు. పిల్లలు పెద్దలు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు సుల్తాన్ బాయి, ఉపాధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్, సెక్రటరీ సంసూరియ రియాద్, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేద ముస్లింలకు దానం చేశారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి జీవించాలని సూచించారు. ఈ ఏడాది కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి అరణియార్ పూర్తి స్థాయిలో నిండాలని, అన్నదాతలు శిభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



వరదయ్యపాళెం: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. పేదలకు మాంసం దానం చేశారు. మత గురువులు ఖురాన్‌ను బోధించారు.





శ్రీకాళహస్తి: ఈద్గాకు హాజరైన ముస్లింలు, అనంతరం ప్రార్థనలు చేస్తున్న దృశ్యం





రేణిగుంట ఈద్గాలో బోధిస్తున్న మతగురువు, అనంతరం సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

‘నేను బడికి పోతా’ను విజయవంతం చేయాలి

నారాయణవనం: మండలంలో ఐదేళ్లు నిండిన బడి ఈడు పిల్లలను నూటికి నూరు శాతం బడిలో చేర్పించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారులు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలు విద్యావనరుల కేంద్రానికి సరఫరా అయినట్టు పేర్కొన్నారు. పుస్తకాలు పంపిణీ చేయనున్నామన్నారు. ఎంపీపీ స్కూళ్లలో ఐదవ తరగతి, ఎంపీయూపీ స్కూళ్లలో ఎనిమిదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాలన్నారు. గ్రామాల్లో పాఠశాలల పరిధిలో డ్రాపవుట్స్, స్కూళ్లలో అసలు చేరని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడానికి ‘నేను బడికి పోతా’ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు నమ్మకం కల్గించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వివరించాలన్నారు. నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాల, పాలమంగళం ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ కింద ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు చేపట్టినట్టు పేర్కొన్నారు. పదిపాసైన విద్యార్థులను హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు ప్రభాకర్ రాజు, గోవిందస్వామి విజ్ఞప్తి చేశారు.

పెద్దశేష వాహనంపై ప్రసన్నుడి వైభవం



పెద్దశేష వాహనంపై భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారు

- ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 6.55 నుంచి 7.25 వరకు మిథున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామాస్మరణల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు కంకణభట్టార్, సూర్యకుమారాచ్చార్యులు వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. నూతన వస్త్రంపై గరుత్మంతుడిని లిఖింపజేసి, పూజలు చేసి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ముక్కోటి దేవతలను 18 గణాలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ఆంతర్యమని అర్చకులు వివరించారు. అంతకుముందు తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు అర్చకులు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పెద్దశేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు..

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మాడవీధుల్లో స్వామివార్లకు పెద్దసంఖ్యలో భక్తులు నారికేళ కర్పూర హారతులు ఇచ్చారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచ్చార్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు చిన్నశేష వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్‌సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు హంసవాహనంపై స్వామివారు విహరిస్తారు.



తిరుచ్చిపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు

చేతిపంపునకు మరమ్మతులు చేయండి



వెంగారెడ్డికండ్రిగ తూర్పు హరిజనవాడలో మరమ్మతులకు గురైన చేతి బోరు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీలోని తూర్పు హరిజనవాడలో స్థానికులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ బోరు మోటారు నుంచి నీరు సరిగా సరఫరా కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్న చేతిబోరు కూడా పనిచేయడం లేదని, దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య గురించి అనేక మార్లు అధికారులకు విన్నవించినా ఏమాత్రం స్పందన లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి దాహార్తిని తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కేసులు

పిచ్చాటూరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ఇరిగేషన్ గ్రౌండ్‌తోపాటు ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో కొందరు ఆకతాయిలు రాత్రిళ్లు మద్యం సేవిస్తున్నట్టు ఫిర్యాదులు అందడంతో ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలు తదితర నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో స్థానిక ఫ్యాక్టరీ కాంప్లెక్స్ వద్ద యువకులు మద్యం సేవించి ఒక వ్యక్తిని హత్య చేశారని గుర్తు చేశారు. ఇరిగేషన్ గ్రౌండ్, ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో ఉన్న మద్యం సీసాలను తొలగించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఆకతాయిలపై కేసు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ వెంకట్‌రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పిచ్చాటూరు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు తొలగిస్తున్న సిబ్బంది

తీరుమారని ప్రైవేటు పాఠశాలలు

శ్రీకాళహస్తి: పట్టణంలో ప్రైవేటు పాఠశాలల తీరుమారడం లేదు. సెలవు దినాల్లో కూడా పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బక్రీద్ సందర్భంగా సోమవారం సెలవు ఉన్నా కొన్ని పాఠశాలలు విద్యార్థులకు తరగతులు నిర్వహించాయి. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆ పాఠశాలల వద్దకు చేరుకుని విద్యార్థులకు సెలవు ఇప్పించారు. ఈ నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ పాఠశాలలకే కాకుడా విద్యాజ్యోతి, ఎంజీఎం, వివేకానంద పాఠశాలలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని మండిపడ్డారు. ఎంఈవో స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.



ప్రైవేటు పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

పంట మార్పిడితో అధిక ప్రయోజనాలు

- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం
- ఒకే పంటతో చీడపీడలు అధికం
- పంట మార్పిడితో భూమిలో సేంద్రియ పదార్థాల వృద్ధి



పిచ్చాటూరు మండలం రజానగరంలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

పిచ్చాటూరు : ఏటా ఒకే పంట సాగు చేస్తే రైతులకు పెట్టుబడులు పెరుగుతాయి. అంతేగాక పంటపై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. దిగుబడులు తగ్గుతాయి. ఏటా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకేరకం పంటను ఏళ్ల తరబడి సాగు చేయడం వల్ల పంటల ఎదుగుదల తగ్గుతుందని, చీడపీడల ఉద్ధృతి అధికంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు. అందుకే పంటమార్పిడి చేయాలని వివరిస్తున్నారు. పొలంలో ఒకే రకం కాకుండా వేర్వేరు పంటలను సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చన్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకత, ప్రయోజనాలను వివరిస్తున్నారు.

ఒకే తరహా పంటలతో నష్టాలు

- ఏటా ఒకే తరహా పంట సాగుచేయడం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయి. కలుపు బెడద అధికంగా ఉంటుంది. సాగుచేసిన పైరు కూడా ఎదుగుదల ఉండదు. తద్వారా దిగుబడులు తగ్గుతాయి. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరిగి నష్టం వాటిల్లుతుంది.
- ఒకే పంట సాగుతో వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేలకోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యత ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వస్తుంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగుచేసుకోవాలి.
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లను ఒకదాని తరువాత ఒకటి సాగుచేయాలి. ఉదాహరణకు జొన్న, పత్తి.
- భూసారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తరువాత ఒకటి సాగు చేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

- వరిపంట సాగుచేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుంది. అంతేగాక సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా చేరుతుంది. దీంతో పైరు ఏపుగా పెరుగుతుంది.
- వరి తరువాత అపరాలు లాంటి పైర్లు సాగుచేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం అధికమౌతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉద్ధృతి తగ్గుతుంది.
- వరి తరువాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగుచేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

మంచి దిగుబడులకు అవకాశం



పంట మార్పిడి వల్ల రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు. ప్రస్తుతం రైతులు అధిక శాతం తమ పొలాల్లో ఏటా ఒకేరకం పంట సాగుచేస్తున్నారు. నీటి పారుదల కింద వరి తప్ప ఇతర పంటలు సాగుచేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమమైంది. రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి అమలు చేయాలి. –సంజీవ రెడ్డి, ఏవో, పిచ్చాటూరు